


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 277 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు బుధవారం 10 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :277 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE WED 10 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## 'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి

### క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను

- విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- విశాఖలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన లోకేష్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, శాశ్వత ఉద్యోగం హామీ
- కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్ర మంత్రి లోకేష్ పరామర్శ
- ప్రమాద కారణాలపై ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలంటూ ఆసుపత్రిలో క్షతగాత్రుడి విజ్ఞప్తి

- మిగతా 2లో

## నేడు విశాఖ వెళుతున్న జగన్..

### స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ

- మొన్న విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- ఎనిమిది మంది కార్మికుల దుర్మరణం
- ఘటనపై ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జగన్



పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను, అలాగే గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ రేపు విశాఖలో పర్యటించనున్నారు. ఈ ప్రమాదంపై జగన్ ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఆయన స్పందిస్తూ... బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని స్థానిక వైసీపీ నాయకులను

- మిగతా 2లో



## హైదరాబాద్ లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ
- ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

పెన్ పవర్ డెస్క్:నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు

- మిగతా 2లో



## బాణసంచా గోదాంలో భారీ పేలుడు..

### ఏడుగురు కార్మికులు సజీవ దహనం

పెన్ పవర్ డెస్క్:రాజస్థాన్ రాష్ట్రంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. మంగళ వారం (జూన్ 9) జైపూర్‌లోని ఓ అక్రమ బాణసంచా గోదాంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు సజీవ దహనం అయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం

- మిగతా 2లో



# వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

## పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్

- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేం దుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్సు ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికా రులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో

- మిగతా 2లో



## వైసీపీ 'శవ రాజకీయాలు' చేస్తోంది

- విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించిందన్న నారాయణ
- సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ ఘటనను పర్యవేక్షిస్తున్నారని వెల్లడి
- 2029 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు మళ్లీ గుణపాఠం చెబుతారని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించిందని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న ఆయన, ఈ ప్రమాదం నేపథ్యంలో తాను తిరుపతిలో పాల్గొనాల్సిన అధికారిక కార్యక్రమాన్ని కూడా రద్దు చేసుకున్నట్లు వివరించారు. బాధితులకు మెరుగైన వైద్యం, తక్షణ సహాయక చర్యలు

- మిగతా 2లో



## ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై హైకోర్టు ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్: ప్రభుత్వ భూములకు నకిలీపట్టాల సృష్టిపై సిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఖానామెట్ భూములకు నకిలీ పట్టాలు సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ భూమి తనదంటూ పిటిషన్ దాఖలు చేసిన ఇట్టిగా ప్రాపర్టీస్‌కు రూ. 5లక్షల జరిమానా

- మిగతా 2లో

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు



- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమన్న బొత్స
- బాధితులు కోరుతున్న పరిహారం ఇవ్వాలని వ్యాఖ్య
- మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్

- మిగతా 2లో

## ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి

- ఆసుపత్రిలో ఉన్న కుటుంబ పెద్దను చూసేందుకు వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న బంధువులు
- ఈ విషయం తెలియకుండానే, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కన్నుమూత
- ప్రమాదంతో గుర్గావ్ అగర్వాల్ కుటుంబంలో ఎవరూ మిగలకుండా పోయిన వైనం
- హోటల్ యాజమాని, వంట మనిషిని అరెస్ట్ చేసిన పోలీసులు

- మిగతా 2లో



### తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

## రాజ్య సభ నామినేషన్ తిరస్కరణ

పెన్ పవర్ డెస్క్: రాజ్య సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైంది. తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసు వివరాలను నామినేషన్‌లో ఆమె వెల్లడించలేదని బీజేపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల సంఘం (ఈసీ) ఈ నిర్ణయం తీసుకుంది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో బీజేపీ అభ్యర్థి ఎన్నిక

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# బెజవాడలో కమ్యునిస్టులు ఎక్కడ? నాడు శాసించి... నేడు

విజయవాడ అంటే ముందుగా గుర్తుకొచ్చేది కమ్యునిస్టులు. ఒకప్పుడు బెజవాడలో కమ్యునిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. విజయవాడ నగరంలో ఎక్కువగా కమ్యునిస్టు ఓటు బ్యాంకు ఉండేది. సీపీఎం, సీపీఐ బలంగా ఉండేవి. విజయవాడ నగర పాలక సంస్థను కూడా కమ్యునిస్టులు చేజిక్కించుకున్నారు. 1981 నుంచి 1999 వరకూ నగరపాలక సంస్థలో కమ్యునిస్టులు రాజ్యమేలారు. అన్ని డివిజన్లపై పట్టుండేది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సీపీఐ పలుమార్లు విజయం సాధించింది. కానీ 1999 లో టి. వెంకటేశ్వరరావు చివరి మేయర్ గా కమ్యునిస్టుల తరుపున పనిచేశారు. తర్వాత ఇంత వరకూ కార్పొరేషన్ కూడా దక్కలేదు.

**మారుతున్న పరిస్థితుల్లో...**

మారుతున్న రాజకీయ పరిస్థితుల కారణంతో కమ్యునిస్టుల ఓటు బ్యాంకు కూడా చెల్లాచెదురయినట్లు కనిపిస్తుంది. విజయవాడలో కమ్యూనిస్టులు పూర్తిగా కనుమరుగయ్యారని చెప్పలేం కానీ, వారి ప్రాభవం మాత్రం కాలక్రమేణా భారీగా తగ్గిపోయింది. ఒకప్పుడు బెజవాడను శాసించిన కమ్యూనిస్టు పార్టీలు, నేడు స్వతంత్రంగా గెలిచే స్థాయిని కోల్పోయి, ప్రధాన పార్టీలతో పొత్తుల మీదే ఆధారపడే స్థితికి చేరుకున్నాయి.బెజవాడలో కమ్యూనిస్టుల పరిస్థితికి సంబంధించిన ముఖ్య విషయాలు:దశాబ్దాల క్రితం ఆధిపత్యం: స్వాతంత్రోద్యమ కాలంలో, ముఖ్యంగా 1934లో విజయవాడలోనే ఆంధ్రా కమ్యూనిస్టు ఉద్యమం పురుడు పోసుకుంది. 1980లు, 90ల వరకు నగరపాలక సంస్థలో తిరుగులేని శక్తిగా ఉండేవి. విజయవాడకు తొలి మేయర్‌గా సీపీఐ నేత టి.వెంకటేశ్వరరావు పనిచేయడం దీనికి నిదర్శనం.

**ఆధిపత్య పోరుతోనే...**

సీపీఐ, సీపీఎంల మధ్య ఆధిపత్య పోరు, కార్మిక సంఘాల్లో తగ్గిన పట్టు, మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల నగరంలో వీరి ఓటు బ్యాంకు గణనీయంగా పడిపోయింది.ప్రత్యక్ష ఎన్నికల్లో విజయాలు అంతంత మాత్రమే అయినప్పటికీ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరసనలు, పోరాటాల్లో వామపక్షాలు ఇప్పటికీ క్రియాశీలకంగానే పనిచేస్తున్నాయి. అయినా సరే కమ్యునిస్టులు గెలిచేటంతగా తమ బలాన్ని పెంచుకోలేకపోతున్నాయి. ప్రజాసమస్యలపైన, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నప్పటికీ కమ్యునిస్టులకు ఓట్లు రాలడం లేదు. దీంతో పట్టున్న బెజవాడ నగరం ఎర్రన్న చేతుల్లో నుంచి చేజారిపోయినట్లే కనిపిస్తుంది. ఇక పుంజుకునే అవకాశాలు కూడా కనిపించడం లేదు. టీడీపీ, వైసీపీ, బీజేపీలు క్రమంగా బలపడటంతో కమ్యునిస్టుల ఓటు బ్యాంకు చెల్లాచెదురయింది.

# 'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు.కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనంగా రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, "అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్లైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత" అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు.ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. "నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ. 25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం" అని తెలిపారు.

ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు జరుగుతుందని లోకేష్ అన్నారు. "ఇది కింద నుంచి లీకవ్వలేదు, పైనుంచి పొంగలేదు. ద్రవ ఉక్కు బయటకు కక్కినట్లుగా ఉంది. దీని వెనుక కారణాలను నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేశారు. వారు ఈరోజే విశాఖ వచ్చి కార్మికులతో మాట్లాడి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయి" అని వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన ఓ సంఘటనను లోకేష్ ఉద్వేగంగా పంచుకున్నారు. "గాయపడిన శ్రీనివాస్ అనే కార్మికుడిని పరామర్శిస్తే, ఆయన తన ఆరోగ్యం గురించి కాకుండా 'అయ్యా, మమ్మల్ని కాదు, దయచేసి విశాఖ ఉక్కును కాపాడండి. లక్షలాది కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి' అని వేడుకున్నాడు. ఆ మాటలు కార్మికులకు ఫ్యాక్టరీతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశాయి. ఆయన మాటలు నన్ను కదిలించాయి" అని అన్నారు.గతంలో వాజ్‌పేయి, చంద్రబాబు హయాంలో రూ.15 వేల కోట్ల ప్యాకేజీతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కార్మికుల కుటుంబాలకు అదే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్రకు రానున్న భారీ పెట్టుబడుల నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, యువతకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని లోకేష్ హామీ ఇచ్చారు.

## ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి

ఢిల్లీలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాద విషాదంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తన కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని కోల్పోయిన 80 ఏళ్ల రాధే శ్యామ్ అగర్వాల్, ఆ చేదు నిజం తెలియకుండానే మంగళవారం కన్నుమూశారు. దీంతో గురుగ్రామ్‌కు చెందిన అగర్వాల్ కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది.

శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రాధే శ్యామ్ అగర్వాల్ ఢిల్లీలోని సాకేత్ మాక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను చూసుకునేందుకు గురుగ్రామ్‌లో నివసించే ఆయన కుమారుడు వివేక్ అగర్వాల్, కోడలు, మనవరాళ్లతో సహా మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఢిల్లీకి వచ్చారు. వీరంతా ఆసుపత్రికి సమీపంలోని మాల్వియా నగర్‌లో ఉన్న 'ఫ్లరిష్ స్టే' అనే హోటల్‌లో బస చేశారు.

జూన్ 3న ఉదయం 8:30 గంటల సమయంలో ఆ హోటల్‌లోని వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వివేక్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఎనిమిది మందితో పాటు మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. తన కుటుంబానికి ఇంతటి ఘోరం జరిగిందన్న విషయం తెలియని రాధే శ్యామ్, తన వాళ్లెవరూ పలకరించడానికి రావడం లేదని ఆసుపత్రి సిబ్బందిని నిరంతరం ఆరా తీస్తుండేవారు. చివరకు ఆయన కూడా చికిత్స పొందుతూ మృతి చెందడంతో, ఆ కుటుంబంలో ఒక్కరు కూడా మిగలకుండా పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, హోటల్ యజమాని లవకేశ్ బజాజ్, వంట మనిషి కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా నిబంధనల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ దుర్ఘటనతో గురుగ్రామ్‌లోని అగర్వాల్ కుటుంబ నివాసం మూగబోయింది.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజులతో కూడిన బృందం పరామర్శించింది. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ... ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధితులు కోరుతున్న పరిహారం గొంతెమ్మ కోరిక కాదని, ప్రభుత్వం వారి డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్టీల్‌ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టేందుకు, ప్రైవేటీకరణ చేసేందుకే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ కుట్రల వల్లే ప్లాంట్‌లో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆరోపించారు.

స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని బొత్స విమర్శించారు. ఇప్పటికే దాదాపు 10 వేల మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని, ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 'ఎల్జీ పాలిమర్స్' తరహాలో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చి చెప్పారు. అలాగే, బాధితులను పరామర్శించేందుకు జగన్ రేపు విశాఖలో పర్యటిస్తారని వెల్లడించారు.

## బాణసంచా గోదాంలో భారీ పేలుడు.. ఏడుగురు కార్మికులు సజీవ దహనం

మొదటి పేజి తరువాయి

అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించారు. జైపూర్‌లోని తలాయ్ కాలనీలో అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన ఓ ఇంట్లో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. భారీ పేలుడు తర్వాత మంటలు వేగంగా వ్యాపించడంతో పలువురు కార్మికులు లోపల చిక్కుకుపోయారని తెలిపారు. ఏడుగురూ కాలిన గాయాలతో మరణించారని జైపూర్ ఏసీపీ వినోద్ శర్మ ధృవీకరించారు.

వీరిలో ఐదుగురు ఎస్ఎంఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా.. ఒకరు అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మరొకరు ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. మృతులను సమీర్, ఆబిద్, నాసిర్, అబ్దుల్ వాహిద్, బిలాల్‌గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిల్వ ఉంచిన అత్యంత మండే స్వభావం గల పదార్థం పేలుడుకు కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. పేలుడు తర్వాత భారీగా ఎగసిపడుతోన్న మంటల నుంచి తప్పించుకోవడానికి కార్మికులు పరుగులు తీయడంతో అక్కడ భయానక వాతావరణం నెలకొందని ప్రత్యక్ష సాక్షులు వివరించారు. అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి లోపల చిక్కుకున్న పలువురిని బయటకు తీశారు. కాగా, ఈ ఘటనపై రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, మాజీ సీఎం అశోక్ గ్లెహాట్ సంతాపం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై హైకోర్టు ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

విధించింది. నకిలీ పట్టాల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపైనా సీఐడీ దర్యాప్తునకు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఐపీఎస్ అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశాలు ఇచ్చారు. గతంలో టీజీఐఐసీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ ఇట్టిగా ప్రాపర్టీస్ అనే సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. ఖానామెట్‌లో 15 ఎకరాలను కొనుగోలు చేశామని పిటిషన్ వేసింది. అయితే, ఖానామెట్‌లో ఈ భూమిని 1997లోనే టీజీఐఐసీకి ప్రభుత్వం కేటాయించడం గమనార్హం.

## వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్..

- మొదటి పేజి తరువాయి

పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు.

2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు 'మల్టిప్లైయర్ ఎఫెక్ట్' తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## నేడు విశాఖ వెళుతున్న జగన్..

- మొదటి పేజి తరువాయి

ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ శ్రేణులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నిన్న సాయంత్రం స్టీల్‌ప్లాంట్‌లో ఒక పెద్ద పేలుడు సంభవించింది. 150 టన్నుల లాడిల్ నుండి కరిగిన ఉక్కు ఒక్కసారిగా కిందపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా... మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

## హైదరాబాద్ లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- మొదటి పేజి తరువాయి

జిల్లాలకు భారత వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం కూడా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**హైదరాబాద్‌లో భారీ వర్షం**

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న భాగ్యనగరవాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రాంనగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముషీరాబాద్‌తో పాటు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## వైసీపీ 'శవ రాజకీయాలు' చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

అందించడంపైనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనను పర్యవేక్షిస్తున్నారని నారాయణ పేర్కొన్నారు. అయితే, ఈ విషాదాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ దారుణమైన శవ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన, 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు మళ్లీ తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇక గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన 56 ఫిర్యాదుల్లో 60 శాతానికి పైగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల వల్లే ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని, వీటి పరిష్కారానికి మంత్రుల కమిటీ పనిచేస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నారని, వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

## తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్య సభ నామినేషన్ తిరస్కరణ

- మొదటి పేజి తరువాయి

ఏకగ్రీవమైంది.కాగా, మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్య సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం రెండు స్థానాలను బీజేపీ సునాయాసంగా కైవసం చేసుకోనుండగా.. ఒక స్థానం కాంగ్రెస్?కు దక్కే అవకాశం ఉంది. ఈ మూడో సీటు కోసం కాంగ్రెస్ తరుపున మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే, హైదరాబాద్?లో నమోదైన క్రిమినల్ కేసు వివరాలు, ఆస్తులు, బ్యాంక్ లావాదేవీల వివరాలను ఉద్దేశపూర్వకంగానే మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాల్లో దాచిపెట్టారని బీజేపీ అభ్యర్థి ఈసీకి ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదును పరిశీలించిన రిటర్నింగ్ ఆఫీసర్ మీనాక్షి నటరాజన్ నామినేషన్?ను రిజెక్ట్ చేశారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ పరిశీలన ప్రక్రియలో తిరస్కరణకు గురి కావడంతో మధ్యప్రదేశ్?లోని మూడవ రాజ్యసభ స్థానానికి కూడా పోటీ ముగిసింది. బీజేపీ అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఈసీ ప్రకటించింది. నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా పోరాటం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

## స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో

# ప్రకాశం జిల్లా ప్రకాశించాలి

**– అధికారులతో సమీక్షా సమావేశంలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్**





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 09**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమైన స్వర్ణాంధ్రను,. ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం వికసిత్ భారత్ ను సాధించేందుకు.. ప్రభుత్వం సంకల్పించిన లక్ష్యాల సాధనలో ప్రకాశం జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సిబ్బంది ఉద్యోగులు కలిసికట్టుగా కృషి చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ స్పష్టం చేసారు. మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పది అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జూలై 1 నుండి ప్రారంభం కానున్న వీబీ జి రాం జి ద్వారా నాణ్యమైన గ్రామీణ ఆస్తుల కల్పనకు మార్గదర్శకాలకు అనుగుణంగా సరైన ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. కొత్తపట్నం – పాకాలలో పర్యాటక రంగం వృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగిన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు, ఆయుష్మాన్ భారత్ – డా. ఎన్టీఆర్ వైద్య సేవలను విస్తృత స్థాయిలో అమలు చేసి ఆరోగ్య ప్రకాశం జిల్లాగా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో పేదలకు నాణ్యమైన విద్య అందించి మానవ వనరుల అభివృద్ధితో స్వర్ణాంధ్రకు బాటలు వేయాలని దిశా నిర్దేశం చేశారు. తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్నా భోజన పథకాలతో డ్రాప్ అవుట్స్ శాతాన్ని తగ్గించడం జరిగిందని అంటూ ఆయన అధికారులను అభినందించారు, పీఎం శ్రీ – మన బడి మన భవిష్యత్ తో పాఠశాలలలో నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని లంకా దినకర్ వెల్లడించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి మరియు ఉద్యోగ కల్పనకు అవరోధాలు ఏర్పడకుండా చూడాలని ముఖ్యంగా ప్రైవేట్ సంస్థలకు భారీ స్థాయిలో భూముల కేటాయింపుల్లో సహేతుకమైన విధానాలు ఉండాలని వాస్తవ పరిస్థితులను అధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రానైట్ తవ్వకాల విషయంలో పర్యావరణ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మినరల్ డెవలప్మెంట్ ఫండ్ నిబంధనల మేరకు వినియోగం పైన ఆడిట్ చేయాలని నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకాశం జిల్లా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సురక్షిత తాగునీరు అందించే విధంగా జల్ జీవన్ మిషన్, అమృత్ ప్రణాళికలు అమలు చేయాలని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ( స్వర్ణాంధ్ర – వికాసిత్ భారత్) ఛైర్మన్ లంకా దినకర్ స్పష్టం చేశారు. పథకాల స్ఫూర్తిని పూర్తిస్థాయిలో అర్థంచేసుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేయడం ప్రధానమని.. ఈ నేపథ్యంలో స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమం అమలుకావాలని అధికారులకు లంకా దినకర్ స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టరేట్ నందు ఇరవై సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్, జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి వైద్య ఆరోగ్యం, విద్యకు సంబంధించిన పథకాలు , విబి జి రాం జి, అమృత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్‌లకు సంబంధించిన ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో . లంక దినకర్ అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలు వేగవంతం కోసం అధికారులు మరింత చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాలో 19 నుండి 45 సంవత్సరాల వయస్సు వారికి, ముఖ్యంగా 5 నుండి 19 సంవత్సరాల వారికి, గర్భిణీ స్త్రీలకూ అవసరమైన వైద్యం అందించి మందులు అందిస్తూ అనీమియా ముక్త్ భారత్ కోసం అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం అర్హులైన 8.31 లక్షలలో లక్షల మందికి పీఎంజేఏవై కార్డులు పంపిణీ కోసం సర్వే పూర్తి 8.08 చేశామని అధికారులు తెలిపారు. మిగిలిన వారుంటే వారికి కూడా సత్వరం పంపిణీ చేయాలని అధికారులను లంకా దినకర్ ఆదేశించారు. అలాగే, 70 సంవత్సరాలు పైబడిన వారు పెద్ద వయస్సు రీత్యా కార్డులను వారి వద్దకే వెళ్లి ప్రక్రియ పూర్తి చేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

జిల్లాలో 108 వాహనాలు, 104 వాహనాలు ద్వారా సేవలందుతున్నాయని.. 108 వాహనాలకు సంబంధించి రెస్పాన్స్ టైమ్ పట్టణాలలో 17 నిమిషాలు, గ్రామాలలో 21 నిమిషాలు పడుతుందని అధికారులు తెలిపారు. 104 వాహనాల ద్వారా మండలాలకు చెందిన విలేజ్ హెల్త్ సెంటర్లకు మెడికల్ ఆఫీసర్లతో నెలకు రెండుసార్లు స్థానికులకు సేవలందిస్తున్నట్లు, 102 తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్లు ద్వారా గర్భిణి స్త్రీలకు సేవలు అందించామని పేర్కొన్నారు. జిల్లాలో 2025 – 26 సంవత్సరానికి మొత్తం అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలలో ( 1980 – హై స్కూల్: 482, ప్రైమరీ స్కూల్: 1358, అప్పర్ ప్రైమరీ స్కూళ్లు: 140 ) కళాశాలలు (87 ) కలిపి మొత్తం 1.86 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలో ఎన్రోల్మెంట్ అయ్యింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 619 మంది అధ్యాపకులు నియామకం డీఎస్సీ ద్వారా 2024 అనంతరం డబుల్ ఇంజన్ సర్కార్ లో నియామకాలు జరిగాయని లంకా దినకర్ వెల్లడించారు. 1015 మోడల్ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో, 50 పీఎం శ్రీ స్కూళ్లలో విద్యార్థుల ఆరోగ్యం లక్ష్యంగా సురక్షిత త్రాగు నీరు, స్వచ్ఛత కోసం మరుగుదొడ్లు, భవనాల, ఫర్నిచర్ ఆధునీకరణ నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థుల ఆరోగ్య భద్రత, పరిసరాల పరిశుభ్రత ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్వహించ బడుతున్నాయి. మన బడి మన భవిష్యత్ – పీఎం శ్రీ కింద మొత్తం 50 స్కూళ్లకు 189 పనులకు 7.13 కోట్లు మంజూరు కాగా, ఇందులో 181 పనులను పూర్తి చేసి 7.07 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లుఅధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న కార్యక్రమాలను జిల్లా లో పటిష్టం గా అమలు చేయడంలో సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో అమలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాధురి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, జిల్లా విద్యా శాఖాధికారి రేణుక, సిపిడిసిఎల్ ఎస్ఈ వెంకటేశ్వర రావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ నాగేశ్వర రావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈ ఈ సంజయ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం – ప్రకాశం

# కంభం చెరువు కట్టపై యోగా

**జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**





పెన్ పవర్, కంభం జూన్ 9

ప్రజల ఆరోగ్యం ఆనందం ఆత్మవిశ్వాసం మరియు సమగ్ర శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని 21 వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినారు కలెక్టర్ ఎన్. విజయ సునీత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కంభం చెరువుకట్టపై నిర్వహించిన ఈ యోగా కార్యక్రమం ద్వారా శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, జీవితానికి శక్తి సమాజానికి స్ఫూర్తి లభిస్తుందని పేర్కొన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది ఆరోగ్యవంతమైన సానుకూలమైన సమతుల్యమైన జీవితానికి మార్గదర్శకమని తెలిపారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక కాలంలో యోగ సాధన యొక్క ఆరోగ్య విధానాలు గురించి మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ గుర్తించి దేశానికి చాటి చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి రోజూ యోగా చేయడం వలన ఈ వయసులో కూడా ఎంతో ఆరోగ్యం గా హుషారుగా ఉన్నారు అని తెలిపారు. మనం ఇంట్లో ఆసనాలు వేయడం వల్ల మన శరీరం మీద ఒత్తిడి తగ్గించుకోవచ్చు అని, కంభం చెరువు కట్ట పూర్వం శ్రీ క్రిష్ణ దేవరాయలు వారి సతీమణి వరదరాజమ్మ గారి కోసం నిర్మించినారు .కానీ అది నేడు ఆసియా ఖండం లోనే అతి పెద్ద చెరువుగా రూపాంతం చెందింది అని కొత్తగా ఏర్పడిన మన మార్కాపురం జిల్లాలో మన వెనుకబడిన ప్రాంతాన్ని గుర్తించి ఈ ప్రదేశంలో ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. చివరగా యోగా సాధకులకు సంస్కృతిక నృత్యాలు చేసిన,చిన్నారులకు , అతి తక్కువ సమయంలో ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వారికి శాలువా, పూల మాల , యోగాంధ్ర జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. యోగ సందేశాన్ని ప్రజల హృదయాల్లో నింపే ఈ కార్యక్రమంలో జెసి పులి శ్రీనివాసులు ఆర్డీవో శివరామ్ రెడ్డి జిల్లా యంత్రాంగం అధికారులు ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు యువత విద్యార్థులు పెద్ద సంఖ్యలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లింగసముద్రంలో మీకోసం

**–వినియోగించుకోవాలని ప్రజలకు కలెక్టర్ పిలుపు**



**కందుకూరు పెన్ పవర్, జూన్ 9**

లింగసముద్రం మండల కేంద్రంలో ఈనెల 12వ తేదీన ' మీకోసం ' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో ప్రతి శుక్రవారం ఒక నియోజకవర్గంలో 'మీకోసం 'కార్యక్రమం నిర్వహించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసియున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లింగసముద్రం తహసిల్దార్ కార్యాలయంలో ' మీకోసం ' కార్యక్రమం జరుగుతుంది.

**చినపవని లో పల్లెనిద్ర ..:** ఈనెల 11వ తేదీ గురువారం రాత్రి లింగసముద్రం మండలంలోని చినపవని గ్రామంలో జిల్లా కలెక్టర్ ' పల్లెనిద్ర ' కార్యక్రమం ఉంటుంది. గ్రామస్తులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకుంటారు. రాత్రికి చినపవని గ్రామంలోనే బస చేసి శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటిస్తారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయికి వస్తున్న దృష్ట్యా ఈ కార్యక్రమాల ద్వారా తమ సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

## మాలకొండరాయునిపాలెంలో

# పారిశుధ్య సమస్యలు తీవ్రం

**-దోమల విజృంభణతో ప్రజల్లో ఆందోళన**

**-జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్న వేళ నిర్లక్ష్యంపై విమర్శలు**





**లింగసముద్రం, పెన్ పవర్ జూన్ 9 :**

మండలంలోని మాలకొండరాయునిపాలెం గ్రామ పంచాయితీలో పారిశుధ్య సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. గ్రామంలో కాలువలు పూడుకుపోవడం, మురుగు నీరు నిల్వ ఉండటం, చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయి. విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం సర్పంచుల పాలన ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ, గ్రామాల సమస్యలపై వారు సరైన దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయితీల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ప్రధాన కాలువ పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు నిలిచి పోయి దుర్వాసన వెదజ ల్లుతోంది. పాఠశాలలు జూన్ 12 నుంచి తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల పరిసరాల్లో నిల్వ ఉన్న మురుగు నీరు దోమలకు ఆవాసంగా మారిందని చెబుతున్నారు. గ్రామంలోని పలుచోట్ల చెత్త కుప్పలు పేరుకుపోవడం, మురుగు నీరు తొలగించకపోవడం వల్ల దోమల సంఖ్య గణనీయంగా పెరిగింది. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్స్ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో భయం నెలకొంది. గ్రామ ప్రజలు పంచాయితీకి పన్నులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ కనీస పారిశుధ్య సేవలు అందడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధి కారులు గ్రామాలను సందర్శించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతు న్నారు. ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టాలి పూడికతో నిండిన కాలువలను వెంటనే శుభ్రం చేయాలి,దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహించాలి.గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

# కందుకూరులో గంజాయి ముఠాపై పోలీసుల మెరుపుదాడి

**-16 మంది అరెస్ట్.. 2.873 కిలోల గంజాయి స్వాధీనం -డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు డిఎస్పీ హితవు**





**కందుకూరు, పెన్ పవర్ జూన్ 9**

కందుకూరు పట్టణంలో గంజాయి వినియోగం, విక్రయాలపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక నిఘా ఫలితంగా భారీ డ్రగ్స్ ముఠా గుట్టురట్టైంది. కందుకూరు టౌన్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో మొత్తం 16 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 2 కిలోల 873 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం డీఎస్పీ బాలసుబ్రమణ్యం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో కందుకూరు ఎస్డీపీవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, కందుకూరు సీఐ అన్వర్ బాషా కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఆపరేషన్ నిర్వహించారు. డంపింగ్ యార్డ్ వద్ద 14 మంది పట్టివేత జూన్ 8వ తేదీ ఉదయం కందుకూరు ఆనందపురం రోడ్డుకు సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద కొందరు యువకులు గుంపులుగా చేరి గంజాయి సేవించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మెరుపుదాడి నిర్వహించారు. అక్కడ ఉన్న 14 మందిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద నుంచి మొత్తం 473 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించి, మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి కందుకూరు టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**మరో ఇద్దరి వద్ద 2.4 కిలోల గంజాయి**

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న షేక్ అఫ్రోజ్ గురించి అదనపు సమాచారం అందడంతో పోలీసులు గుడ్లూరు రోడ్డులోని బీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని సెల్ టవర్ వద్ద దాడి నిర్వహించారు. అక్కడ అఫ్రోజ్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద 2 కిలోల 400 గ్రాముల గంజాయి లభించింది. దీంతో మొత్తం స్వాధీనం చేసుకున్న గంజాయి పరిమాణం 2 కిలోల 873 గ్రాములకు చేరింది.

**గంజాయి కేసు నమోదు**

ఈ ఘటనపై కందుకూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 64/2026గా కేసు నమోదు చేసి, ఎన్డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు తెలిపారు. కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన కందుకూరు సీఐ అన్వర్ బాషా, ఎస్ఐలు శివ నాగరాజు, బాలకృష్ణ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు మెదడు, మానసిక ఆరోగ్యం, శరీరంలోని అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. ఒకసారి డ్రగ్స్‌కు బానిసైతే బయటపడటం చాలా కష్టమని, డ్రగ్స్ వ్యసనం కారణంగా కొందరు దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. డ్రగ్ కేసుల్లో పేరు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని, ముఖ్యంగా విద్యార్థులు యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.

**సమాచారం ఉంటే వెంటనే తెలియజేయండి**

గంజాయి ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్ర యాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలి సిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112 లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు సమా చారం అందించాలని పోలీసులు కోరారు. సమా చారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతా యని హామీ ఇచ్చారు.గంజాయి రహిత సమాజ నిర్మాణమే పోలీసుల లక్ష్యం యువత భవిష్యత్తును కాపాడేందుకు కఠిన చర్యలు కొనసాగుతాయి అని పోలీసులు స్పష్టం చేశారు.

# శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర సమగ్ర శిక్ష అకడమిక్ మోనిటరింగ్ కోఆర్డినేటర్ కల్పన





**కందుకూరు పెన్ పవర్, జూన్ 9**

స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూలులో జరుగుతున్న కందుకూరు నియోజకవర్గ స్థాయి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణా కేంద్రాన్ని రాష్ట్ర సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ కోఆర్డినేటర్ కల్పనా శైల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థుల మెదడు అభివృద్ధిలో సుమారు 85 శాతం ఒకటి, రెండు తరగతుల దశలోనే జరుగుతుందని, అందువల్ల ప్రాథమిక తరగతుల విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులలో భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల పట్ల బాధ్యతాయుత దృక్పథంతో వ్యవహరించి పాఠశాలలను ఆకర్షణీయంగా, ఆహ్లాదకరమైన అభ్యాస కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 36 రోజుల స్కూల్ రెడినెస్ కార్యక్రమానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు, మాడ్యూల్స్ ఇప్పటికే పాఠశాలలకు చేరాయని తెలిపారు. అదేవిధంగా బాల కిట్స్, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్, జాదూ పిటారా కిట్స్, ఎఫ్ఎల్ఎన్ కిట్స్, టార్ల్ కిట్స్ వంటి వివిధ రకాల బోధన-అభ్యసన సామగ్రిని పాఠశాలలకు అందించామని చెప్పారు. డిజిటల్ కంటెంట్‌తో కూడిన 256 జీబీ పెన్‌డ్రైవ్‌లను కూడా అందించామని, వీటిని సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులు కరికులం లక్ష్యాలు, సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. జాయ్‌ఫుల్ లెర్నింగ్ ద్వారా విద్యార్థులకు నైపుణ్య ఆధారిత విద్యను అందించాలని, పాఠశాలల మౌలిక వసతులను మెరుగుపరుచుకొని ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని ఆమె పేర్కొన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. మార్కాపురం ఉన్నత పాఠశాలను అక్కడి ప్రధానోపాధ్యాయుడు ఎంతో సుందరంగా అభివృద్ధి చేసిన విధానాన్ని ప్రశంసిస్తూ, జిల్లాలోని అన్ని పాఠశాలలు అదే తరహాలో అభివృద్ధి చెందాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అన్ని వసతులు బాగా ఉన్నాయని మంచి భోజనం రుచికరంగా అందజేశారని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్, ఎంఈఓలు సుబ్బారెడ్డి, శర్మ, కేఆర్పీలు అర్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య, డీఆర్పీలు పాల్గొన్నారు. సుమారు 280 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొని, శిక్షణలో పొందిన మెలకువలు తమ బోధనలో ఎంతో ఉపయోగపడతాయని, ఈ కార్యక్రమం తమకు విశేషమైన సంతృప్తిని కలిగించిందని తెలిపారు.

# నరసయ్య కి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పెన్ పవర్, జూన్ 9**

మండల తెదేపా పూర్వ అధ్యక్షులు నార్నె రోశయ్య మామ ఎడ్లపల్లి నరసయ్య సోమవారం పరమపదించారు. మంగళవారం పలుకూరు గ్రామంలోని వారి నివాసానికి వెల్లి నరసయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రోశయ్య కి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారిని ఓదార్చారు. నరసయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భగవంతుని ప్రార్థించారు.

# నేడు కొమరోలులో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశం

### సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొననున్న ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి



**కొమరోలు పెన్ పవర్ జూన్ 9**

కొమరోలు మండలం స్థాయి తెలుగుదేశం పార్టీ సమావేశం ఈనెల 10వ తేదీ బుధవారం కొమరోలులో నిర్వహించనున్నట్లుగా కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు కొమరోలు మండల స్థాయి తెలుగుదేశం పార్టీ సమావేశం కొమరోలు లోని మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి నివాస గృహ ప్రాంగణంలో ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నదని వారు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరులు గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. కావున మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ,బూత్ ఇన్చార్జీలు, యూనిటీ ఇన్చార్జీలు, బిఎల్ఏలు తదితర తెలుగుదేశం పార్టీ శ్రేణులు సమావేశానికి తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం...



**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 9**

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అంగన్వాడీ కార్యకర్త కే. జయమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని నాయుడుపాలెం స్వర్ణ గ్రామ పరిధిలో ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు సహకరించిన తల్లిదండ్రులను సన్మానించడంతో పాటు బాలికల విద్యను ప్రోత్సహించే కుటుంబాలను అభినందించాలని సూచించారు. బాలికలు పాఠశాలలకు సురక్షితంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో భద్రతాయుత వాతావరణం కల్పించాలని నిర్ణయించారు. నూతన విద్యా సంవత్సరానికి పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయా అనే అంశంపై చర్చించారు. చదువు మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని, అవసరమైతే ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు టి. కాశమ్మ, వెంకటలక్ష్మమ్మ, నాగమ్మ, నాగలక్ష్మి, వ్యవసాయ సహాయకుడు ప్రేమ్‌కుమార్, కిషోరి బాలికలు, తల్లిదండ్రులు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రో ధరలకు నిరసనగా రాస్తారోకో

### -ప్రభుత్వాలు తమ విధానాలు మార్చుకోవాలి -వామపక్ష నాయకుల డిమాండ్




**కందుకూరు పెన్ పవర్, జూన్ 9:**

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో వామపక్ష నాయకులు కార్యకర్తలు రాస్తారోకో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు సిపిఎం పట్టణ కార్యదర్శి గౌస్ బాషాలు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ గెలిచిన నాటి నుండి దేశ ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, మునిగే నక్క పై తాటికాయ పడ్డట్టు అన్న చందంగా పెట్రోలు గ్యాస్ డీజిల్ ధరలు పెంచి దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులను మరింత దిగజారుస్తున్నారని వారు ఆరోపించారు. దాంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా తన ప్రయోజనాల కోసం చేస్తున్న యుద్ధంలో మనం బలి పశువులను కావాలా అని, అమెరికాతో మనకు శత్రుత్వమా, మిత్ర బలమా మోడీ తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల విధానం కారణంగా పెట్రో, గ్యాస్ ధరలు అధికంగా ఉన్నాయని ఫలితంగా నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని సామాన్యుని బతుకు బండి కూలిపోతుందని అన్నారు. ఇలాంటి తరుణంలో సామాన్య ప్రజలు సైతం ఉద్యమ బాట పట్టాలని పిలుపు ఇచ్చారు. రాస్తారోకో కారణంగా సబ్ కలెక్టర్ కార్యాలయ వద్ద ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్ ను మళ్లించారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు యర్రంశెట్టి ఆనందమోహన్, నత్తా రామారావు, ఉప్పుటూరి మాధవరావు, నీలి శెట్టి నరసయ్య, మాధురి, శ్రీరామ్ మూర్తి, బాల బ్రహ్మచారి, దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు, సిపిఎం నాయకులు సుల్తానా, మాలకొండ రాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ట్రై సైకిల్స్ డస్ట్ బిన్‌లు పంపిణీ

### కలెక్టర్ విజయ సునీత -ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి






**పెన్ పవర్, కంభం జూన్ 9**

కంభం మండల పరిషత్ కార్యాలయం వద్ద పరిసరాల పరిశుభ్రత మరియు వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ట్రై సైకిల్స్ డస్ట్ బిన్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయ సునీత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నిల్వలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షితంగా సేకరించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడాన్ని నిరోధించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని తెలిపారు. దీంతో దోమల పెరుగుదల తగ్గి, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా నివారించవచ్చని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్ మరియు డస్ట్ బిన్ల పంపిణీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ సునీత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని పచ్చ జెండా ఊపి ట్రై సైకిల్స్ మరియు డస్ట్ బిన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే అశోక రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. కంభం మండలానికి 27 రిక్షాలు, ట్రై సైకిల్స్, డస్ట్ బిన్ల పంపిణీతో చెత్త సేకరణ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని కూటమి ప్రభుత్వం అభివృద్ధి లో ముందు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, సిబ్బంది మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తొలి ప్రధాని నెహ్రూ రికార్డును అధిగమించిన ప్రధాని నరేంద్ర మోదీ

### దేశ చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానిగా మోదీ రికార్డ్

### దేశాభివృద్ధికి మోదీ సేవలు శిరస్మరణీయం మాదినేని లక్ష్మణ్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 9**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరంగా ప్రధానమంత్రి పదవిలో కొనసాగుతున్న నాయకుడిగా చరిత్ర సృష్టిస్తున్నారని రాష్ట్ర బిజెపి మాజీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు మొత్తం 4,398 రోజుల పాటు ప్రధానమంత్రిగా కొనసాగారని, ఆ రికార్డు ఇప్పటివరకు చెక్కుచెదరలేదన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ 2014 మే 26న ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టి ఈ నెల 10 నాటికి 4,399 రోజులపాటు పదవిలో కొనసాగుతూ ఆ రికార్డును అధిగమించి కొత్త చరిత్రను సృష్టిస్తున్నారని కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై విశిష్ట స్థానం సంపాదించిందని, అభివృద్ధి, సంక్షేమం, జాతీయ భద్రత, అంతర్జాతీయ ప్రతిష్ఠ పెంపులో ఆయన విశేష కృషి చేశారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించి దేశానికి నిరంతరం సేవలందిస్తున్న నాయకుడిగా మోదీ గుర్తింపు పొందారని అన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపు మేరకు, జిల్లా బిజెపి అధ్యక్షులు పి.వి. కృష్ణారావు ఆదేశాల మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు సమావేశమై 10 వ తేదీ ఉదయం దేవాలయాలు, ప్రార్థన మందిరాలలో ప్రత్యేక పూజల కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీర్ఘాయుష్షు, ఆరోగ్యకరమైన జీవితం కలిగి దేశ ప్రజలకు మరింత సేవలు అందించాలని కోరుకుంటూ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు ప్రధాని మోదీ చారిత్రాత్మక రికార్డు సందర్భంగా పార్టీ ఆదేశాలు మేరకు నాయకులు కార్యకర్తలు అభిమా నులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కిశోర వికాస కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూన్ 9**

కిశోర వికాస కార్యక్రమం చివరి దశలో భాగంగా మంగళవారం అంగన్వాడి కేంద్రంలో కిశోర బాలురు, బాలికలు మరియు వారి తల్లులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం కోడ్ నంబర్లు 3, 4, 14, 16, 17, 18 పరిధిలో జరిగింది. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణ, బాలికల భద్రత, విద్య ప్రాధాన్యత, వ్యక్తిగత నిర్ణయాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలబాలికలు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్య యొక్క అవసరాన్ని వివరించడంతో పాటు బాల్య వివాహాలపై అవగాహన కల్పించే వీడియోలను ప్రదర్శించారు. అంగన్వాడి పిలుస్తుంది అనే అంశంపై సూపర్వైజర్ ఎం. బుజ్జి మాట్లాడుతూ, చిన్నపిల్లలను అంగన్వాడికి పంపించడం ద్వారా ఆటపాటలతో కూడిన విద్య అందుతుందని తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కీలకమని వివరించారు. దీనిలో భాగంగా కిశోర బాలురు, బాలికలతో అవగాహన ర్యాలీ నిర్వహించగా, బాలురతో ప్రత్యేకంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎం. బుజ్జి, కె. రవి కుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాల్య వివాహాల నివారణతో పాటు విద్యపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని అన్నారు.

# సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

### ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి





**మార్కాపురం పెన్ పవర్ జూన్ 9**

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని మంచి విద్యను అందించడం ద్వారా విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టవచ్చునని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫౌండేషన్ లీటరసీ న్యూమరసి శిక్షణ తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కందులు నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి, రెండవ తరగతుల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. 1,2 తరగతి విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని కోరారు. మార్కాపురం నియోజకవర్గంలో గొట్లగట్టు జడ్పీ హైస్కూల్ విద్యార్థి 592 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటడం ఆనందకరమన్నారు. ఆ స్కూల్ హెడ్మాస్టర్ కి ఈనెల 19వ తేదీ జరగనున్న మెగా పేరెంట్స్ డే మీటింగ్ రోజున లక్ష రూపాయలు ప్రోత్సాహంగా అందజేస్తానని అన్నారు. అదేవిధంగా 580 మార్కులు దాటిన వారికి కూడా ఆ స్కూలుకు వెళ్లి త్వరలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పెంచిన ఇంధన ధరలను ఉపసంహరించుకోవాలి

## వామపక్ష నాయకుల డిమాండ్







**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 09**

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మే నెలలో 4 సార్లు పెట్రోలు డీజీలు ,వంటగ్యాస్ ధరలు పెంచిందని, ఈ భారాలతో ప్రజలు అల్లాడుతున్నారని, మోడీ ప్రభుత్వం గత 12 సంవత్సరాలు పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇరాన్. పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని సాకుగా చూపి ప్రజలపై కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుందని నాయకులు వామపక్షాల నాయకులు అన్నారు. మంగళవారం సిపిఎం, సిపిఐ ,సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో సాగర్ హోటల్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు ,సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకట్రావు ,సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డి వి న్ స్వామి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నాంచార్లు తదితరులు మాట్లాడారు. అప్పుల్లో కూరుకు పోయిన అమెరికా తిరిగి ప్రపంచంలో తన ఆధిపత్యం కొనసాగించడం కోసం చమురు నిల్వ ఉన్న దేశాలపై యుద్ధాలు చేస్తుందని అన్నారు. రష్యా పోరుగున ఉన్న ఉక్రెయిన్ పై అమెరికా, యూరప్ దేశాలు ఆయుధాలు, డబ్బు ఇచ్చి ఆ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని సృష్టించారని, వీటి వల్ల ప్రపంచంలో ఆయిల్ సమస్య తీవ్రమైందని అన్నారు. యుద్ధం జరిగిన 46 రోజుల తర్వాత ఇరాన్ మన దేశానికి వస్తున్న పడవలను అడ్డుకోకుండా స్నేహ ధర్మాలు కొనసాగించిందని, హోర్మోన్ జల సంధి వెలుపల అమెరికా సైన్యాలు మోహరించి తమ పడవలను అడ్డుకుంటడంతో మన దేశంలో పెట్రోల్ డీజిల్ తో పాటు అనేక సమస్యలు వస్తున్నాయని చెప్పారు. మన రాష్ట్రంలో కృష్ణ గోదావరి బేసిన్ లో ఉత్పత్తి అవుతున్న చమురు గుజరాత్, మహారాష్ట్రలను తరలించి అక్కడ నుంచి దేశం అంతా అమ్ముకొని రిలయన్స్ లాంటి కంపెనీలు భారీగా లాభపడుతుంటే మనం ఆయిల్ తో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కేజీ బేసిన్లో ఉత్పత్తి అవుతున్న గ్యాస్ ఆయిల్ లో చట్టపరంగా 50 శాతం వాటా రాష్ట్రానికి రావాలని, దీన్ని సాధించడం కోసం పెట్రోల్, డీజిల్, గ్యాస్ చౌకగా ప్రజలకు అందించవచ్చు అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుందని, టిడిపి, జనసేన, వైసిపి పార్టీలు ఈ హక్కులను సాధించడానికి ఎందుకు ముందుకు రావడం లేదని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు జిల్లా నాయకులు జి రమేష్ , కె రమాదేవి, బంకా సుబ్బారావు, కేజీ మస్తాన్, పి ఆంజనేయులు, సిపిఐ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్టి సర్దార్, రామకృష్ణ , కొత్తకోట వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ నాయకులు ఆర్ మోహన్ ,బి పద్మ ,రాజశేఖర్ ,సిపిఐ ఎంఎల్ ఎస్ లలిత కుమారి , పరిటాల కోటేశ్వరరావు , ఎమ్మెస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో క్రైస్తవుల భారీ ప్రదర్శన




**పొదిలి, పెన్ పవర్, జూన్ 9**

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ పొదిలి లో క్రైస్తవులు భారీ ప్రదర్శన జరిపారు. మంగళవారం నాడు దళిత క్రైస్తవుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన భారీ ఎత్తున జరిగింది. ముందుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ ల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ నుండి క్రైస్తవ సోదరులు, దళిత నాయకులు, క్రైస్తవ సోదరీమణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, మండల రెవెన్యూ అధికారి ఎం.వి కృష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. దళిత క్రైస్తవుల నిరసన ప్రదర్శన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# పెట్రోల్ ధరల పెంపుదలకు నిరసనగా పొదిలిలో వామపక్షాల ఆందోళన




**పొదిలి, పెన్ పవర్, జూన్ 9**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరల కు నిరసనగా పొదిలిలో వామపక్షాలు ఆందోళన జరిపాయి. మంగళవారం నాడు పట్టణంలోని పెద్ద బస్టాండ్ సెంటర్ లో వామపక్షాల నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో జరిపి, తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ ఇరాన్, అమెరికా యుద్ధం సాకుతో కేంద్ర ప్రభుత్వం ఆయిల్ ధరలను పెంచడం అన్యాయమన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ధనవంతులకు దోచి పెట్టే విధంగా తయారయిందని వారు తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ఆయిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు నర్రా వెంకటేశ్వర రెడ్డి, పి బాల నరసయ్య, బి కోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సర్ సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించండి

## - నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 09**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సర్వేపై సమగ్రంగా అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు, వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఒంగోలు నగర టీడీపీ అధ్యక్షులు బండారు మదన్ సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వేపై ఒంగోలు నియోజకవర్గ స్థాయిలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు కు అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని మదన్ కోరారు. అలాగే సర్వే ప్రక్రియలో ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ, అవసరమైన పత్రాల సమర్పణలో సహకారం అందించాలని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలకు దిశానిర్దేశం చేశారు. డివిజన్ స్థాయిలో బి ఎల్ ఓ లతో మన పార్టీ బి ఎల్ ఏ లు పనిచేసి సర్వే విజయవంతం కావడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్లు, డివిజన్ పార్టీ పార్టీ అధ్యక్షులు, యూనిట్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై బగ్గుమన్న ప్రజాసంఘాలు




**పామూరు, పెన్ పవర్,జూన్ 9**

మండల కేంద్రంలో సిపిఐ, సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెరిగిన పెట్రోల్ డీజిల్ నిత్యవసర ధరల పెంపుకు వ్యతిరేకంగా స్థానిక నెల్లూరు, కందుకూరు రోడ్డు కూడలిలో ప్రజా సంఘాలు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పశ్చిమ ఆసియా దేశాల యుద్ధం కారణంగా పెరిగిన ముడిచమురుదలకు అనుగుణంగా డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను దశలవారీగా విపరీతంగా పెంచారు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గిన మనదేశంలో మాత్రం చమురు కంపెనీలు డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గించలేదు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ధరలను నియంత్రిస్తామని ధరలను పెంచబోమని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని తుంగలో తొక్కారు. కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు పన్నులు తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలపై పన్నుల రూపంలో సాధారణ ప్రజల నుండి గుంజుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 31 శాతం పన్నుతో పాటు నాలుగు రూపాయలు వ్యాట్ ను, లీటర్ కి ఒక రూపాయి చొప్పున రోడ్డు పన్ను వసూలు చేస్తూ దేశంలోనే అత్యంత అధిక పన్ను వసూలు చేస్తుందని వారు అన్నారు. అలాగే డీజిల్ రేటు పెంపుదల ఫలితంగా రవాణా చార్జీలు పెరిగి అన్ని నిత్యవసర ధరలు పెరుగుతున్నాయి అన్నారు. కేంద్ర రాష్ట్ర ల పన్నుల భారాలు తగ్గించాలి, ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ధరలను నియంత్రించడానికి ప్రజల పైన భారాలు మోపకుండా రాజ్యాంగంలో ధరల చట్టాన్ని అమలు చేయకుండా అధికార కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వారు అన్నారు. ఇప్పటికైనా అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగిన, తగ్గిన ఎప్పుడు ధరలు పెంచకుండా స్థిరీకరంగా ఉండేటట్లు చట్టం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే పెరిగిన వంట గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి సుబ్బారావు, మండల సహాయ కార్యదర్శులు మస్తాన్రావు సూరిబాబు, కిసాన్ సింగ్, మోహన్ రావు, రమణయ్య, వెంకట్ రెడ్డి సిపిఎం నుంచి కే. మాలాద్రి, షేక్ అల్లబకాష్, సయ్యద్ ఖాదర్ భాష, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాలలో త్వరలో ఇంటర్ అడ్మిషన్లు

## విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 9**

మండలంలోని శీలంవారిపల్లి కదిరి వెంకట నరసయ్య - లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు త్వరలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు, విద్యా కమిటీ చైర్మన్ మూరం మస్తాన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ప్రతి గ్రూపులో 40 మంది చొప్పున మొత్తం 80 మందికి మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించే ఉపాధ్యాయ బృందం కళాశాలలో ఉందని అన్నారు. కళాశాల ప్రారంభమైన నాటి నుంచి విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, రాష్ట్రంలోని ప్లస్ కళాశాలల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని వివరించారు.కళాశాలలో విశాలమైన తరగతి గదులు, ఆధునిక విద్యా వసతులు, క్రీడా మైదానం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ లో చేరే బాలికల కోసం కళాశాల ఆవరణలోనే కేజీబీవీ-4 టైప్ హాస్టల్ సౌకర్యం ఉండటంతో పాటు ప్రభుత్వం ఉదయం అల్పాహారం రాత్రికి భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఏఐ ఎర్లీ చైల్డ్హుడ్ డెవలప్మెంట్ స్కానింగ్ పై ప్రత్యేక శిక్షణ



**దొనకొండ జూన్ 9 పెన్ పవర్**

మండల కేంద్రంలో స్థానిక జడ్.పి.హెచ్ హై స్కూల్ లో పీఎం అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం ఏఐ ఎర్లీ చైల్డ్హుడ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ కార్యక్రమం పై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు ఆరేళ్లలోపు చిన్నారుల శారీరక మానసిక భాష మరియు సామాజిక అభివృద్ధి దశలను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి అభివృద్ధిలో ఏవైనా లోపాలు ఉంటే ముందుగానే తెలుసుకునేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు సిడిపిఓ పరిమళ తెలిపారు ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలకు ప్రత్యేక యాప్ వినియోగ విధానం చిన్నారుల వివరాల నమోదు స్క్రీనింగ్ ప్రక్రియ నివేదిక తయారీ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు చిన్నారుల ఎదుగుదల లో సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి తగిన వైద్య పోషకాహార సేవలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం లో అంగన్వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సి పి డి ఓ సూచించారు శిక్షణలో డాక్టర్ వెంకట నాగ మౌళి చంద్ర మోహన్ సూపర్వైజర్ సిహెచ్ సుభాషిని అనురాధ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించండి

## వెలిగండ్ల ప్రాజెక్టు సూపర్వైజర్ దేవకృపావరం



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 9**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల నమోదు పెంపొందించే లక్ష్యంతో మంగళవారం "బడి పిలుస్తుంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలిగండ్ల ప్రాజెక్టు సూపర్వైజర్ దేవకృపావరం పాల్గొని అంగన్వాడీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులను కలుసుకుని అంగన్వాడీ కేంద్రాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ దేవకృపావరం మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం, ఆటలు, పాటల ద్వారా ప్రాథమిక విద్య అందించడంతో పాటు పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన అనేక సౌకర్యాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొని తల్లిదండ్రులకు నమోదు ప్రక్రియపై వివరాలు తెలియజేశారు.

# బాల్య వివాహాలు వద్దు, చదువే ముద్దు

**పామూరు, పెన్ పవర్,జూన్ 9**

మండలం లోని చట్టుమడుగు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం - 2026 ప్రత్యేక వేసవి శిబిరాన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎం.వి.ఎస్. పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు, తల్లులతో పార్వతి మాట్లాడుతూ మానవ జీవితంలో విద్య అత్యంత కీలకం. ఇది వ్యక్తిగత వికాసానికి, మేధాశక్తికి, సమాజ అభివృద్ధికి మూలాధారం అని విద్య ఆవశ్యకతను వివరించారు. కౌమార బాలికలందరూ పాఠశాలకు వెళ్లి ఉన్నత విద్య అభ్యసించేలా తల్లులు ప్రోత్సహించాలని ఆమె కోరారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలని, బాల్య వివాహాలు నేరమని అవగాహన కల్పించారు. పిల్లలను బడికి పంపకుండా పనికి పంపడం కూడా నేరమేనని హెచ్చరించారు. బడి మానేసిన పిల్లలు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్, డిగ్రీ చదువుకోవచ్చని ఆమె సూచించారు. పది, ఇంటర్ చదివిన బాలికల తల్లులను ఆమె కృతజ్ఞతలతో అభినందించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీకి పంపాలని, అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 11-18 ఏళ్ల లోపు బాలికల రక్షణకు పోక్సో చట్టం ఉందని, సమస్య వస్తే చైల్డ్ హెల్ప్లైన్ 1098 లేదా పోలీస్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కిశోర బాలికలు, తల్లులు బాల్య వివాహాలు చేయబోమని, పిల్లలను తప్పకుండా బడికి పంపుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో 'కిశోరి వికాసం'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కె. విజయకుమారి, గ్రామంలోని కిశోర బాలికలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



# బాలల అక్రమ రవాణాను అడ్డుకున్న అధికారులు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 09**

బీహార్ రాష్ట్రం నుండి చెన్నైకి వివిధ ఫ్యాక్టరీలో కూలి పనులు చేయుటకు 15 మంది బాలలను తరలిస్తున్న వారిని ఒంగోలు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల సంక్షేమ కమిటీ , ఒంగోలు జిఆర్పి పోలీస్, ఆర్పిఎఫ్ పోలీస్, షార్ట్స్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థలు అసోసియేషన్ ఫర్ సోషల్ వాలంటీర్ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు రైల్వే స్టేషన్లో రక్షణలోకి తీసుకోవడం జరిగింది. జోక్ బాద్ నుండి చెన్నై ఈ రోడ్ ట్రైన్ లో బాలలను అక్రమ రవాణా చేస్తున్న బాలలను తదనంతరం జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి ముందు బాలలను ప్రవేశ పెట్టడం జరిగింది . జాయింట్ కలెక్టర్ బాలురను అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు బీహార్ రాష్ట్రంలో ఏ ఏ జిల్లా నుంచి వచ్చారు.. వారి తల్లిదండ్రులు ఒక పరిస్థితి తెలుసుకుని వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి బాలురను అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పోలీస్ అధికారులు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బాలలను జిల్లా బాలల సంక్షేమ కమిటీ తాత్కాలిక





ఆశ్రమం కొరకు జిల్లా సాంఘిక సంక్షేమ వసతి గృహములో వసతి కల్పించారు. బాల కార్మికులను రక్షించటంలో కమిటీ చైర్మన్ నీలిమ, జిల్లా బాలల సంరక్షణ అధికారి పీ దినేష్ కుమార్, ఒంగోలు ఆర్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ వై కొండయ్య, జిఆర్పి సబ్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆర్ సునీల్ కుమార్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ శ్రీకాంత్, ఏ పి డి ఆర్. డాక్టర్ ప్రహసిత్, సాడ్స్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సుమన్, తదితరుల కృషిని పలువురు అభినందించారు.

# వైఎస్సార్సీపీ ఇన్చార్జి దద్దాల ను కలిసిన మండల నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 9**

కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ ను మంగళవారం కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో మండలానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు ఆలా నాగార్జున, కోనంకి నవీన్, రాగసాని తిరుపతయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ మండలంలో పార్టీ కోసం కష్టపడి బలోపేతం చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొబ్బిళ్ళ శ్రీనివాసులు యాదవ్, పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 9**

ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన కనిగిరిలోని అమరావతి గ్రౌండ్ లో మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశానికి మండలం నుంచి బొబ్బూరి రమేష్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుండి పార్టీ నాయకులు బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చార్జీలు, సీనియర్ టిడిపి నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోవిలంపాడు గ్రామ పంచాయతీ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి, బూత్ కన్వీనర్ నన్నసాని రమేష్, ఉప్పలపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు ఇసుకపల్లి తిరుపతయ్య, పులి రాజశేఖర్, కాలువ నరసయ్య, మండల బిసి సెల్ ఉపాధ్యక్షులు చందలూరి బాలకాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు.మండల టిడిపి సమావేశం

## మండల పార్టీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు



**పామూరు, పెన్ పవర్,జూన్ 9**

ప్రతి నెలలో రెండవ బుధవారం రాష్ట్ర తెలుగు దేశం పార్టీ మరియు ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు, నియోజకవర్గ శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలమేరకు ఈ ఉదయం 10 గంటలకు స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల టిడిపి సమావేశం జరుగుతుందని మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు తెలిపారు. ఈ సమావేశానికి క్లస్టర్ ఇన్చార్జీస్, కో ఇన్చార్జీస్ , యూనిట్ ఇంచార్జీస్, కో-ఇన్చార్జెస్, గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు, బూత్ ఇంచార్జిలు, ఎంపీటీసీలు రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని బొల్లా నరసింహారావు పార్టీ శ్రేణులను కోరారు.

# కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 గా శ్రీనివాసులు రెడ్డి నియామకం

## ఉత్తర్వులు జారీ చేసిన గుంటూరు ఆర్జేడి బి. లింగేశ్వర్ రెడ్డి

**కొమరోలు పెన్ పవర్ జూన్ 9**

కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 తాటిచెర్ల మోటు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు తల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి ని నియమిస్తూ గుంటూరు ఆర్జెడి బి. లింగేశ్వర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొమరోలు మండల విద్యాశాఖ అధికారి2 గా బాధ్యతలు నిర్వహిస్తున్న బుర్ర వెంకటరత్నం మే 31వ తేదీన పదవి విరమణ చేశారు. దీనితో కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 పోస్టుకు ఖాళీ ఏర్పడింది. పదవి విరమణ చేసిన బొర్ర వెంకటరత్నం అంకితభావం చిత్తశుద్ధి, నీతి నిజాయితీ తో పనిచేసి, మండల విద్యాశాఖ అధికారి వృత్తికి వన్నె తెచ్చి ఉపాధ్యాయ సంఘాలతో ఉపాధ్యాయులతో ప్రశంసలు అందుకున్నారు. బొర్రా వెంకటరత్నం పదవి విరమణ తో ఏర్పడిన ఖాళీలో కొమరోలు మండలం తాటిచెర్ల మోటు లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న తల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డికి కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 గా ఎఫ్ఏసి బాధ్యతలు అప్పగిస్తూ గుంటూరు రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి లింగేశ్వర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బొర్ర వెంకటరత్నం వలే తాటిచెర్ల మోటు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు తల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి కూడా అంకితభావం, నీతి నిజాయితీ, వృత్తిని దైవంగా భావించే మంచి మనసు గల ప్రధానోపాధ్యాయులుగా పేరు ప్రఖ్యాతులు పొందుతూ కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 గా బాధ్యతలు స్వీకరించనున్నారని తెలుసుకున్న మండల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ తలపురెడ్డి శ్రీనివాసులు రెడ్డికి అభినందనలు తెలుపుతూ స్వాగతం పలుకుతున్నారు. కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 గా బాధ్యతలు స్వీకరించనున్న తల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కొమరోలు మండలం విద్యాశాఖ మరింత అభివృద్ధి పథంలో పయనించి జిల్లాస్థాయిలో కొమరోలు మండలానికి మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయనే ఆశ భావాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. వెల్కమ్ టు శ్రీనివాసులు రెడ్డి సార్.




# ఆర్డబ్ల్యూఎస్ కాంట్రాక్టు వేతనాలు వెంటనే మంజూరు చేయాలి

## దర్శి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కైపు వెంకట కృష్ణారెడ్డి డిమాండ్.

**దర్శి జూన్ 9 పెన్ పవర్**

దర్శి పట్టణం నందు ఆర్డబ్ల్యూఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల 8 నెలల వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం దర్శి ఆర్డబ్ల్యూఎస్ డివిజన్ కాంట్రాక్టు ఉద్యోగులు కార్మికులు ఆధ్వర్యంలో రెండోరోజు కొనసాగిస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పూర్తి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆ సంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర చైర్మన్ దర్శి నియోజకవర్గ ఇన్చార్జి కైపు వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దారుణం అన్నారు. ప్రజలకు త్రాగునీరు అందించే కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కార్మికులు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కిల్ మరియు అన్ స్కిల్డ్ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎస్ఎస్ఆర్ ప్రకారం వేతనాలు వెంటనే అమలు చేయాలని పెండింగ్లో ఉన్న 8 నెలల జీతాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు రాజకీయ నాయకులు వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించి పెండింగ్ జీతాలను విడుదల చేయాలని కైపు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించకపోతే దర్శి ముండ్లమూరు మండలాల్లోని ప్రతి గ్రామంలో కార్మికులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతారని హెచ్చరించారు. అదేవిధంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు కల్పి వెంకటకృష్ణారెడ్డి




ప్రగాఢ నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని తగిన ఆర్థిక సహాయం చేయాలని గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోటంశెట్టి హనుమంతరావు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు దర్శి మండల పరిశీలకు ఏరిగినయని వెంకట నరసయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొడవటికంటి ప్రశాంత్, దర్శి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సిరిమల్లె పౌలేష్, ఎస్.కె వలి, ఆర్మూరు శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ కార్మికులు మరియు ఇతర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం - ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 09**

ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన మరియు పారదర్శకమైన ఆధార్ సేవలను అందించాలనే లక్ష్యంతో యుఐడిఎఐ ఆధార్ సేవా కేంద్రాలు విజయవంతంగా సేవలు అందిస్తున్నాయని, ఈ సేవలను మరింత విస్తరించేందుకు ఒంగోలులో నూతన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభించబడం జరిగిందని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మంగమూరు రోడ్, ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ ఎదురుగా, కెనరా బ్యాంక్ పైనఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ప్రారంభించారు. ఆధార్ నమోదు కేంద్రం లో కొత్త ఆధార్ నమోదు, ఆధార్ వివరాల సవరణలు, బయోమెట్రిక్ అప్డేట్, మొబైల్ నంబర్ అండ్ ఇ-మెయిల్ అప్డేట్, చిరునామా మార్పు, ఆధార్ ప్రింట్ సేవలు, ఇతర ఆధార్ సంబంధిత సేవలను ప్రకాశం జిల్లా ప్రజలందరూ ఈ కేంద్రం ద్వారా వినియోగించుకొని లబ్ధి పొందవలసిందిగా కోరారు.



# నూతన తాసిల్దార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కొండిశెట్టి



**పామూరు, పెన్ పవర్,జూన్ 9**

పామూరు తాసిల్దార్ గా ఆనాటి లక్ష్మీనారాయణ నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు ప్రకాశం జిల్లా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు. వారితోపాటు బిజెపి నాయకులు కొప్పరపు వెంకట సుబ్బారావు, జాజం చిన్న సుబ్బయ్య, టిడిపి నాయకులు పోక నాయుడు ఉన్నారు.

# పామూరు మండల తాసిల్దార్ గా ఆనాటి లక్ష్మీ నారాయణ బాధ్యతలు స్వీకరణ



**పామూరు, పెన్ పవర్,జూన్ 9**

పామూరు మండల నూతన తాసిల్దార్ గా ఆనాటి లక్ష్మీ నారాయణ బాధ్యతలు స్వీకరించారు. శ్రీ పొట్టి శ్రీరాములు (నెల్లూరు) జిల్లా అల్లూరు మండల తాసిల్దార్ గా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై పామూరు తాసిల్దార్ గా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సమస్యలు ఉన్నట్లయితే నేరుగా తనను కలిసి మీ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు సి ఎస్ పురంలో టిడిపి సమావేశం

## మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 9**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నేడు మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీల టిడిపి అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చార్జీలు, బూత్ కమిటీ ఇన్చార్జీలు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, అనుబంధ కమిటీల అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# మేకపాటి ఫ్యామిలీలో ఆస్తులు వార్

**నెల్లూరు జూన్ 9, పెన్ పవర్:**
నెల్లూరు జిల్లాకు చెందిన పొలిటికల్ ఫ్యామిలీ మేకపాటి కుటుంబంలో ఆస్తుల రచ్చ రోడ్డుకెక్కింది. ఈ కుటుంబం నుంచి పలువురు నాయకులు రాజకీయాల్లో ఉన్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆయన సోదరులు.. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డిలతోపాటు.. మేకపాటి విక్రమ్ రెడ్డి(రాజమోహన్‌రెడ్డి కుమారుడు) ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన మేకపాటి గౌతం రెడ్డి మృతిచెందిన విషయం తెలిసిందే. దాదాపు 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఈ కుటుంబానికి నెల్లూరులో మంచి పేరుందిమేకపాటి రాజమోహన్‌రెడ్డి నెల్లూరు ఎంపీగా పలుమార్లు విజయం దక్కించుకున్నారు. ఇక, మేకపాటి చంద్రశేఖరరెడ్డి కూడా ఉదయగిరి నియోజకవర్గం నుంచి పలుమార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డి మాత్రం వైసీపీ తరపున ఉదయగిరి నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్‌గా ఉన్నారు. అయితే.. ఇప్పటి వరకు వీరి కుటుంబ ఆస్తులపై వివాదాలు చెలరేగిన దాఖలాలు లేవు. కానీ, తొలిసారి మేకపాటి చంద్రశేఖరరెడ్డి మీడియా సమావేశం పెట్టి మరీ.. కుటుంబ ఆస్తుల వివాదాలపై మాట్లాడారు.తనకు రెండు పెళ్లిళ్లు జరిగాయని.. ఈ నెపాన్నిచూపించి.. తన సోదరులు రాజమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆస్తులను పంచడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చంద్రశేఖరరెడ్డి వయసు 63 ఏళ్లు. అయితే.. ఆయన ఆస్తుల వివాదంతో రోడ్డెక్కడం అందరినీ విస్మయానికి గురి చేసింది. తన సోదరుడు రాజమోహన్‌రెడ్డి తనకు ఆస్తులు పంచడం లేదని.. రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. ఇప్పుడు తాను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని.. ఈ విషయాన్ని పదే పదే చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. మేకపాటి కుటుంబం స్వతంత్రంగా వ్యవహరించడం లేదని జగన్ చెప్పినట్టు ఆడుతున్నారని ఆయన విమర్శించారు.వైసీపీని వీడి.. టీడీపీలో చేరినందుకే.. తనకు ఆస్తులు పంచకుండా జగన్ తెరచాటున అడ్డు పడుతున్నారని చ

చంద్రశేఖరరెడ్డి దుయ్యబట్టారు. చెల్లికి, తల్లికి కూడా ఆస్తులు పంచని వాడు.. వారిని ఇంటి నుంచి వెళ్లగొట్టిన వాడు చెబితే.. రాజమోహన్‌రెడ్డి ఎలా వింటున్నారని ప్రశ్నించారు.ఉమ్మడి ఆస్తిలో తనకు రూపాయిపంచినట్టు చెప్పినా.. తను ఏమీ అడగబోనన్నారు. దీనిపై బహిరంగ చర్చకు కూడా తాను సిద్ధమేనని అన్నారు. జగన్ కారణంగానే వైసీపీ నాశనం అయిందని, ఇంకా అవుతుందని చెప్పారు. సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి మళ్లీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వ్యాఖ్యానించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రజా సమస్యల పై పోరాటం చేస్తాం

### గిద్దలూరు వైకాపా ఇంచార్జ్ నాగార్జున రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 9**

గిద్దలూరు నియోజకవర్గం గిద్దలూరు పట్టణంలోని ఎమ్ బి ఆర్ కళ్యాణ మండపం నందు మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్సీపీ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు గౌరవ ఇంచార్జ్ కె.పి.నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు వెన్నుపోటు కి రెండేళ్ళు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది. కె.పి.నాగార్జున రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ళు కార్యక్రమం ద్వారా ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు,అధికారంలోకి వచ్చాక ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్తితులను ప్రజల ముందుకు తీసుకువచ్చారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది అని ఆయన తెలియజేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతిపక్షం భాధ్యత ప్రజల తరపున నిలబడి వారి గొంతుకగా పనిచేయడం మా కర్తవ్యం. ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చిన వారి పక్షాన పోరాడేందుకు మేమందరం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని నియోజకవర్గ నాయకులకు,కార్యకర్తలకు తెలియజేశారు. అలాగే ఈ నెల 12న గిద్దలూరు పట్టణంలో జరగబోయే "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో జరగనున్న ర్యాలీలో అన్ని గ్రామ పంచాయతీల నుండి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ పరిశీలకులు కె.వి.రమణ రెడ్డి ,ఎంపిపిలు మేదురి వెంకట రావు,వేగినాటి ఓసుర రెడ్డి గారు,కడప వంశీధర్ రెడ్డి ,జెడ్పీటీసీలు బండ్లమూడి వెంకట రాజయ్య ,సారె వెంకట నాయుడు ,పగడాల శ్రీరంగం ,రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సభ్యులు నెమలిదిన్నె చెన్న రెడ్డి ,బొర్రా కృష్ణ రెడ్డి ,సూరా స్వామి రంగా రెడ్డి ,చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ,బద్దీటి ప్రవీణ్ కుమార్ ,మండల కన్వీనర్లు ఏరువ రంగా రెడ్డి ,గొంగటి చెన్న రెడ్డి ,ఆవుల శ్రీధర్ రెడ్డి గ,బత్తెం ఓబుల్ రావు , మానం బాలి రెడ్డి గారు,యేలం మురళి కృష్ణ,జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు పల్లెబోయిన వెంకట రాజు ,సీనియర్ నాయకులు నాదెండ్ల వెంగయ్య చౌదరి ,భూమా నరసింహ రెడ్డి ,హిమశేఖర్ రెడ్డి జిల్లా కమిటీ ,గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## మెడబలిమి మాలకొండయ్య మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



**పామూరు, పెన్ పవర్, జూన్9**

మండలం లోని మోట్రావులపాడు మాజీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మెడబలిమి వెంకట్రావ్ తండ్రి మెడబలిమి మాలకొండయ్య ఆకస్మికంగా మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, లేని లోటు తీర్చలేనిది అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాలకొండయ్య లేని లోటు తీర్చలేనిది. ఆయన కుటుంబానికి వెన్నంటి ఉంటానని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఆనత పాటు పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## అయ్యన్న వారసులకు లైన్ క్లియర్

**శ్రీకాకుళం, జూన్ 9, పెన్ పవర్:**
ఏపీలో ఇప్పుడు అందరి దృష్టి నర్సీపట్నం నియోజకవర్గం పై పడింది. అక్కడ టిడిపి నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా కూడా ఉన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో తప్పుకుంటానని అయ్యన్నపాత్రుడు పలుమార్లు ప్రకటించారు. ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకుని కూడా ఇదే మాట చెప్పారు. వయసు రీత్యా అయ్యన్నపాత్రుడు క్రియాశీలక రాజకీయాలకు దూరం కావడం ఖాయం. ఎందుకంటే స్పీకర్ లాంటి గౌరవప్రదమైన, రాజ్యాంగబద్ధ పదవి అనుభవిస్తుండడంతో ఆయన పొలిటికల్ గా రిటైర్మెంట్ అవుతారు. అయితే ఆయన తరువాత నర్సీపట్నం నుంచి ఎవరు పోటీ చేస్తారు అనేది ఇప్పుడు ప్రశ్న. నిన్నటి వరకు ఆ నియోజకవర్గ బాధ్యతలు చూసేవారు ఆయన కుమారుడు విజయ్. ఇప్పుడు రాజ్యసభకు ఎంపిక కావడంతో మరింత యాక్టివ్ అవుతారు. కానీ నర్సీపట్నం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్ ఆయనకు లేదు. ఎందుకంటే ఆయన ఆరేళ్లపాటు రాజ్యసభ పదవిలో ఉంటారు. అందుకే ఇప్పుడు నర్సీపట్నంపై పెద్ద చర్చ నడుస్తోంది.అయ్యన్నపాత్రుడు తెలుగుదేశం పార్టీకి అత్యంత వీర విధేయుడు. అదే సమయంలో ముక్కుసూటి మనిషి కూడా. టిడిపి ఆవిర్భావం నుంచి అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు అయ్యన్నపాత్రుడు. ఎన్ని పార్టీల నుంచి ఆహ్వానం వచ్చినా ఆయన మాత్రం వెళ్లలేదు. పార్టీ కష్ట కాలంలో ఉంటే సైలెంట్ గా ఊరుకోలేదు కూడా. తనలోనున్న ఫైర్ బ్రాండ్ ఎప్పటికీ తగ్గలేదు. అయితే తండ్రి మాదిరిగానే దూకుడుగా ఉండేవారు విజయ్. అదే ఆయనకు కలిసి వచ్చింది. రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేసేందుకు దోహద పడింది. సుదీర్ఘకాలం ఐటీడీపీకి సేవలు అందించారు విజయ్. ఈ క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కేసులతో వెంటాడిన భయపడలేదు. వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి విజయ్ పోటీ చేస్తారని అంతా ప్రచారం నడిచింది. కానీ ఇప్పుడు రాజ్యసభకు ఎంపిక కావడంతో అయ్యన్న వారసుడు ఎవరు అనేది ప్రశ్న.2029 ఎన్నికల నాటికి విజయ్ తన రాజ్యసభ పదవిని మూడేళ్ల పాటు పూర్తి చేసుకుంటారు. అప్పటికి మూడేళ్ల సమయం ఉంటుంది ఆయనకు. అయితే రాజ్యసభకు రాజీనామా చేసి టిడిపి అభ్యర్థిగా బరిలో దిగుతారా? ఆ రాజ్యసభ పదవికి వేరొకరికి ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. పోనీ విజయ్ కాకుంటే ఇతర నేతలకు టికెట్ ఇస్తామంటే.. అయ్యన్న కుటుంబానికి కాదని టిడిపి శ్రేణులు ఆదరించే అవకాశమే లేదు. అయితే అయ్యన్నపాత్రుడు రెండో కుమారుడు రాజేష్ ఉన్నారు. ప్రస్తుతం నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ గా వ్యవహరిస్తున్నారు. రాజేష్ ను పోటీలో పెట్టి అయ్యన్నపాత్రుడు తో పాటు విజయ్ గెలిపించుకుంటారన్న టాక్ ఉంది.. మొత్తానికి అయితే అయ్యన్నపాత్రుడు తన పెద్ద కుమారుడిని రాజ్యసభకు పంపించి.. చిన్న కుమారుడిని ఎమ్మెల్యేగా చేసి.. పిల్లలిద్దరి రాజకీయ భవిష్యత్తును చూసి ఆనందిస్తారన్నమాట. కానీ చాలా రాజకీయ కుటుంబాలు ఉన్నాయి కానీ.. అయ్యన్నపాత్రుడు లాంటి అవకాశం ఎవరికీ దక్కదన్న మాట.

## ఏపీలో సరికొత్త సోషల్ ఇంజనీరింగ్

**విజయవాడ, జూన్ 9, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త సోషల్ ఇంజనీరింగ్ ప్రయోగానికి జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. కేవలం ఒకే వర్గానికి పరిమితమైన పార్టీగా జనసేనపై ప్రత్యర్థులు వేస్తున్న ముద్రను చెరిపేస్తూ.. కులాలను కలపడం అనే తన మూల సిద్ధాంతాన్ని ఆయన క్షేత్రస్థాయిలో సీరియస్ గా అమలు చేస్తున్నారు. ఎన్నికల విజయం అనంతరం ఆయన తీసుకుంటున్న రాజకీయ నిర్ణయాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను గమనిస్తే, రాష్ట్రంలో సుస్థిరమైన రాజకీయాలు, సామాజిక సమతుల్యతను సాధించడమే లక్ష్యంగా పవన్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.జనసేన పార్టీకి కాపు సామాజికవర్గం ప్రధాన కోర్ ఓటు బ్యాంక్ అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, ఆ వర్గానికి సముచిత ప్రాధాన్యత ఇస్తూనే, ఇతర సామాజికవర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా పవన్ కల్యాణ్ సమదృష్టిని ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం జనసేన తరఫున గెలిచిన ఇద్దరు లోక్‌సభ ఎంపీలు కాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో.. తాజాగా వచ్చిన రాజ్యసభ ఎంపీ స్థానాన్ని ఇతర వర్గానికి కేటాయించడం ఆయన రాజకీయ పరిణతికి నిదర్శనం. రాజకీయాల్లో కేవలం సమీకరణాలకే పరిమితం కాకుండా, పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందనే బలమైన భరోసాను ఆయన ఈ నిర్ణయం ద్వారా క్యాడర్‌కు పంపారు.ఈ సామాజిక సమతుల్యతపై పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో పార్టీ కోసం పనిచేసి, ప్రస్తుతం పార్టీలో లేని

జేడీ లక్ష్మినారాయణ లాంటి నేతలను ఆయన ప్రస్తావిస్తూ.. ఒకవేళ ఆయన ఇప్పుడు పార్టీలో ఉండి ఉంటే కచ్చితంగా ఈ రాజ్యసభ అవకాశం ఆయనకే ఇచ్చి ఉండేవాడినని ఓపెన్‌గా ప్రకటించారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థం ఒక్కటే.. పార్టీ కోసం నిలబడే వారి విషయంలో తాను కులమతాల పట్టింపులను అస్సలు చూడనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కేవలం ఒకే కులం ముద్ర పడకుండా, సర్వమానవ సమానత్వం అనే జనసేన ఆశయాలకు అనుగుణంగా ఆయన నడుచుకుంటున్న తీరు విశ్లేషకులను సైతం ఆకర్షిస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి కేవలం ఐదేళ్ల పరిపాలనకే పరిమితం కాకూడదని, రాబోయే పదిహేనేళ్ల పాటు ఈ బంధం బలంగా కొనసాగాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షిస్తున్నారు. ఈ సుదీర్ఘ రాజకీయ ప్రయాణం సాధ్యం కావాలంటే కేవలం పార్టీ అగ్రనాయకత్వాలు కలిస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో విభిన్న కులాలు, వర్గాల మధ్య సఖ్యత ఏర్పడాలని ఆయన బలంగా నమ్ముతున్నారు. ఈ 'కులాల కలయిక' అనే కాన్సెప్ట్ సక్సెస్ అయితేనే కూటమి సుస్థిరంగా ఉంటుందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన ఒక దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళు న్నారు.రాజకీయంగా ఈ విధమైన సోషల్ ఇంజనీరింగ్ ప్రయోగాలు గతంలో చాలా తక్కువ మంది నేతలే చేశారు. ప్రాంతీయ పార్టీలు సాధారణంగా తమ కోర్ ఓటు బ్యాంక్‌ను దాటి బయటకు

రావడానికి సాహసించవు. కానీ పవన్ కల్యాణ్ భవిష్యత్తు రాజకీయాల కోసం ఈ రిస్క్ తీసుకుంటున్నారు. పార్టీ అంతర్గత పదవుల నుంచి, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల వరకు అన్ని వర్గాలకు, ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు , మైనారిటీలకు తగిన ప్రాధాన్యత కల్పించేలా ఆయన ఒక రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నారు. ఇది కేవలం ఎన్నికల లబ్ధి కోసం చేసిన తాత్కాలిక వ్యూహం కాదని, ఏపీ రాజకీయాల్లో ఒక శాశ్వత మార్పు కోసం వేస్తున్న పునాది అని చెప్పవచ్చు. పవన్ కల్యాణ్ అనుసరిస్తున్న ఈ వైఖరి జనసేన పార్టీని ఒక సరికొత్త లీగ్‌లోకి తీసుకెళ్తోంది. "అధికారాన్ని పంచుతూ అందరినీ కలుపుకుపోతా" అనే స్థాయికి ఆయన ఎదిగారు. కులాల మధ్య ఉన్న అంతరాలను తొలగించి, రాజకీయంగా అందరికీ భాగస్వామ్యం కల్పించాలనే ఆయన ప్రయత్నం ఏ మేరకు సఫలీకృతమవుతుందో రాబోయే రోజుల్లో తేలనుంది.

## గోదారోళ్లు... ఆ మాత్రం ఉండాల్సిందే...

**రాజమండ్రి, జూన్ 9, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించారు. సిద్ధాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విశాఖపట్నం, రాయలసీమ జిల్లాలలో పరిశ్రమలు కోసం భూములు కావాలంటే ఇచ్చేందుకు ముందుకు వస్తారని.. కానీ గోదావరి జిల్లాలలో సెంటు భూమి కూడా ఇచ్చేందుకు అంగీకరించరంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.గోదావరి జిల్లాలలో భూముల ధరలు భారీగా ఉండటంతో భూమిని సేకరించడం కష్టంగా ఉందనే అభిప్రాయాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. రాయలసీమ, విశాఖ జిల్లాలలో రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తుండటంతో అక్కడికి పరిశ్రమలు వస్తున్నాయని.. గోదావరి జిల్లాలలో భూములు ఇచ్చేందుకు ముందుకు రాకపోవటంతో పరిశ్రమలు తక్కువగా వస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.ఉభయ గోదావరి జిల్లాలలో భూముల ధరలు ఇంతలా ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. వ్యవసాయం, పారిశ్రామికీకరణ, రవాణా సౌకర్యాలు, నగరీకరణ వంటి అంశాలు ఇందుకు ప్రధాన కారణాలు. డెల్టా ప్రాంతంలోని సారవంతమైన నేలలు వ్యవసాయానికి అత్యంత అనుకూలం. దీంతో ఇక్కడి రైతులు వరితో పాటుగా చేపలు, రొయ్యల సాగు వంటి ఆక్వాకల్చర్ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. వాణిజ్య పంటలు బాగా పండే కారణంగా గోదావరి జిల్లాలలో భూములకు మంచి డిమాండ్ ఉంటుంది. ఆక్వా సాగు ద్వారా లాభాలు గడిస్తూ ఉండటంతో ఇక్కడి రైతులు భూములు అమ్మేందుకు ఆసక్తి చూపించరు. అలాగే ఈ జిల్లాల మీదుగా జాతీయ రహదారులు, రైల్వేలైన్లు ఉండటంతో వీటికి ఆనుకుని ఉన్న భూముల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి.ఇక కాకినాడ, ఏలూరు, రాజమండ్రి, భీమవరం, అమలాపురం, పాలకొల్లు వంటి పట్టణాలు క్రమంగా విస్తరిస్తూ ఉండటటంతో.. ఈ ఏరియాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ పెరుగుతోంది. ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారు.. తిరిగి ఇక్కడ పెట్టుబడులు పెడుతూ ఉండటం కూడా భూముల ధరలు పెరగడానికి కారణమని నిపుణులు చెప్తున్నారు.

## అనకాపల్లి జిల్లాలో 'రియల్' బూమ్ షురూ

**విశాఖపట్టణం, జూన్ 9, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా జిల్లాల వారీగా అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ఆయా రంగాల వారీగా ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాలకు పరిశ్రమలు, కంపెనీలను తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. పారిశ్రామిక ప్రగతితో నగరాలు, పట్టణాలతో పాటుగా పల్లె ప్రాంతాల రూపురేఖలు మార్చే ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. కూటమి ప్రభుత్వ ప్రయత్నాలతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుండటంతో.. జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని అనకాపల్లి జిల్లా పారిశ్రామిక ప్రగతి వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఒకప్పుడు బెల్లం, చెరకు, మామిడికి ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా ఇప్పుడు పరిశ్రమలను ఆకర్షించడంలో ముందంజలో ఉంది. ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్, వారీ ఎనర్జీస్, లారస్ ల్యాబ్స్, బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్, లిథియం అయాన్ సెల్ ఫ్యాక్టరీ తదితర కంపెనీలు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటవుతున్నాయి. ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కావడంతోపాటు.. నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడటంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది.అనకాపల్లి జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురంలో అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. ఎస్ రాయవరం, నక్కపల్లి, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో స్థిరాస్థి రంగం ఇటీవలి కాలంలో బాగా పుంజుకుందని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి జిల్లాలో ఎకరం భూమి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉండేదని.. ఇప్పుడు ఎకరా రూ.కోటి వరకు పలుకుతోందని టాక్ వినిపిస్తోంది. విశాఖపట్నం తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనకాపల్లి జిల్లావైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు వ్యాపారులు అనకాపల్లి జిల్లాలో స్థలాల కొనుగోలుపై ఫోకస్ పెట్టినట్లు చెబుతున్నారు. నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటవుతున్న ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో స్థలాలకు గిరాకీ పెరిగిందంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో భూముల ధరలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటు వల్ల భూములకు డిమాండ్ పెరగడంతో ఇటీవల కాలంలో ఈ జిల్లాలో రిజిస్ట్రేషన్లు కూడా భారీగా పెరిగాయి.అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి నుంచి భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు కూడా సిద్ధమవుతోంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే గంటన్నరలోనే భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లొచ్చు. సెమీ రింగ్ రోడ్డు రాకతో అనకాపల్లి జిల్లా మరింత అభివృద్ధి చెందడం ఖాయమంటున్నారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటైన, త్వరలోనే రాబోతున్న పరిశ్రమలకు ఎయిర్‌పోర్టు అనుసంధానం వరంగా మారనుంది. అంతే కాకుండా తుని, పాయకరావుపేట సమీపంలో ఎయిర్ స్ట్రిప్ ప్లాన్ చేస్తున్నారు. అనకాపల్లి - పాయకరావు పేట జాతీయ రహదారి వెంట చిన్న చిన్న వ్యాపారాలు మొదలయ్యాయి. విశాఖపట్నంతో అనకాపల్లి జిల్లాకు రోడ్డు అనుసంధానం కూడా పెరగడం కూడా కలిసి వస్తుందని భావిస్తున్నారు. అనకాపల్లి, నక్కపల్లి, పరవాడ, పాయకరావుపేట ప్రాంతాలు పెట్టుబడికి అనుకూలమని కొందరు స్థిరాస్థి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే ఇక్కడ స్థలాల రేట్లు మరింత పెరుగుతాయని.. అనకాపల్లి మెగా స్టీల్ సిటీగా మారబోతుందని అంచనా వేస్తున్నారు.రాబోయే రోజుల్లో మరికొన్ని పరిశ్రమలు రాబోతున్నాయని.. భవిష్యత్తులో నక్కపల్లి మండలం పరిశ్రమలకు కేంద్రంగా మారబోతుందని భావిస్తున్నారు. ఒకప్పుడు అనకాపల్లి ప్రాంత ప్రజలు ఉపాధి కోసం విశాఖపట్నం వెళ్లేవారు.. పరిశ్రమల ఏర్పాటుతో అనకాపల్లి జిల్లాలోనే భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడంతోపాటు.. విశాఖ డివిజన్ పరిధిలోకి వెళ్లిన అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి రైల్వే స్టేషన్‌లను కూడా అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి చెరుకు, మామిడి పంట ఎగుమతి అవుతున్నాయి. అలాగే యలమంచిలి, పాయకరావుపేటలో మామిడి తాండ్ర కుటీర పరిశ్రమతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సమీపంలోనే మంచినీటి సరస్సు ఉండటంతో పర్యావరణ పరంగానూ అభివృద్ధి జరుగుతోంది.పరవాడ, అచ్యుతాపురంలో పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అనకాపల్లి విశాఖపట్నానికి దాదాపు 40 కిలో మీటర్ల దూరంలో ఉంది.. గంటలోపే విశాఖపట్నం నుంచి అనకాపల్లి చేరుకోవచ్చు. రాబోయే రోజుల్లో విశాఖపట్నం, అనకాపల్లి జంట నగరాలుగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే అనకాపల్లిలోని కొన్ని ప్రాంతాలు విశాఖపట్నంలో కలిసిపోయాయి. రాబోయే రోజుల్లో పరిశ్రమలతో పాటుగా ఐటీ కంపెనీలను అనకాపల్లి వరకు విస్తరించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ కారణాలతో అనకాపల్లి జిల్లాలో రియల్ బూమ్ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో చాలామంది ముందు చూపుతో అక్కడ భూములు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

